క్లుప్తంగా

అవగాహనతోనే ప్రమాదాలకు దూరం

సీఐ కృష్ణభగవాన్



హుస్సేన్‌పురం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: ప్రతి కార్యక్రమంపై పూర్తి అవగాహన ఉన్నపుడు ప్రమాదాలను నివారించవచ్చని సీఐ ఎ.కృష్ణభగవాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం హుస్సేన్‌పురంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయా సెంటర్లలో గణపతి శిబిరాలు ఏర్పాటు చేసే సభ్యులు కమిటీగా ఏర్పడి మండపాల నిర్వహణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో వచ్చే క్యూఆర్ కోడ్‌ను శిబిరాల వద్ద ఉంచాలని, తమ సిబ్బంది దానిని ప్రతిరోజూ తనిఖీ చేస్తారని వివరించారు. ఆయా శిబిరాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కమిటీదే బాధ్యత అని హెచ్చరించారు. గ్రామ నాయకులు చల్లా బుజ్జి, మార్ని సూర్యారావు, కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పురుగు మందులు విక్రయించొద్దు



యండపల్లిలో పురుగుమందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎంఏఓ జోగిరాజు

కొత్తపల్లి: పురుగు మందులు కొనుగోలు చేసిన రశీదులను భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు సూచించారు. మండలంలోని యండపల్లిలోని పురుగు మందుల షాపును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అధికంగా అమ్ముడయ్యే పురుగుమందుల నమూనాలను సేకరించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాల్లో పురుగు మందుల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్టు తెలిపారు. అనుమతులు లేని, కాలం చెల్లిన పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వీవోఏల మండల మహాసభ



మండల వీవోఏల నూతన కమిటీ

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల వీఓఏల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎస్. నిర్మల, కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి అప్పారెడ్డి, మండల సీఐటీయూ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

సామర్లకోట: నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 9, 22, 24, 27, 31 వార్డులలో 15వ ఆర్థిక సంఘ నిధులతో నిర్మించిన రోడ్లను ఆయన మంగళవారం ప్రారంభించారు. అలాగే రత్నంరాజు ఆస్పత్రి నుంచి మఠంసెంటర్ వరకు నిర్మించనున్న రహదారికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, డీఈ కె.శశిధర్, రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా 21వ వార్డు కౌన్సిలర్ యార్లగడ్డ జగదీశ్వరావు పేరు తప్పుగా శిలాఫలకంపై ముద్రించడంతో ఆయన ఇంజినీరింగ్ అధికారులను నిలదీశారు. తన పేరును జగదీశ్వరిగా శిలాఫలకంపై ముద్రించారని, దీనిపై ప్రశ్నించడం పెయింటింగ్‌తో వ్రాయించారని జగదీష్ ఆరోపించారు. దీనిపై కమిషనర్ ఎ.శ్రీవిద్యను వివరణ కోరగా శిలఫలకాన్ని తయారు చేసే కార్మికుడు తప్పు చేసినట్టు గుర్తించిన వెంటనే మార్చామని తెలిపారు.

ఏఎంసీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పెద్దాపురం: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. పెద్దాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె మంగాలక్ష్మి, వైస్ చైర్మన్‌గా మాదిరెడ్డి చంద్రశేఖర్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం మంగళవారం వాలుతిమ్మాపురం రోడ్డులోని డి కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కొత్తెం కోటి, మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదిపూజ్యా.. ఆగమించవయా..!

- చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- మట్టి ప్రతిమలు పంపిణీ చేసిన సంస్థలు

సామర్లకోట/పిఠాపురం: పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాలలో చవితి ఉత్సవాలకు గణనాథులు సిద్ధమయ్యారు. ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఆటో, లారీ స్టాండ్లు, ముఖ్య కూడళ్లలో ఆది పూజ్యునికి పూజలు చేసేందుకు మందిరాలు, పందిళ్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేశారు. మంగళవారం రాత్రికే పూజా సామగ్రిని కొనుగోలు చేసుకుని బుధవారం వేకువ జామునే పూజ చేసుకునేందుకు ప్రజలు సమాయత్తమవుతున్నారు. పిఠాపురం కోటగుమ్మం సెంటర్‌లోని జైగణేష్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేక పూజలతో ప్రారంభ మంగళవారం రాత్రి ప్రారంభం కాగా బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించనున్నారు.

నిమజ్జనం ప్రత్యేకం..

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో నిమజ్జనానికి ఓ ప్రత్యేకత ఉంటుంది. తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి చివరి రోజున ఊరేగింపుగా గణపతి ప్రతిమను నిమజ్జనం చేస్తారు. నీటిలో కరిగిపోయేలా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా నీటి కాలుష్యానికి చెక్ పెడుతున్నారు. వచ్చే నెల ఏడో తేదీన చంద్రగ్రహణం ఉండటంతో 9వ రోజునే నిమజ్జనం చేయాలని పండితులు సూచిస్తున్నారు.



పిఠాపురం కోటగుమ్మం సెంటర్‌లోని జైగణేష్ ఆలయం



సామర్లకోటలో పత్రి, విగ్రహాలు కొనుగోలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అభిషేకాల అనంతరం జైగణేష్

శాస్త్రీయ సందేశాలెన్నో..



మట్టి విగ్రహాలు నిమజ్జనం అనంతరం మళ్లీ భూమిలో కలసి భూమిని సారవంతం చేస్తాయి. పసుపు, కర్పూరం, ధూపం వంటి పదార్థాలకు క్రిమినాశక గుణాలు ఉండి గృహ వాతావరణం శుభ్రపడుతుంది. వ్రతాలు, నియమాల వల్ల జీర్ణ వ్యవస్థ క్రమబద్ధమవుతుంది. మంత్రోచ్చారణ మానసిక ప్రశాంతతను పెంచుతుంది. మొత్తంగా వినాయక చవితి పర్యావరణ ఆరోగ్యం, మానసిక సుఖం, సామాజిక ఐక్యతలను శాస్త్రీయంగా బలపరిచే పండగలా నిలుస్తుంది.

– కుసుమ, ఉపాధ్యాయిని, పిఠాపురం

పత్రికి ప్రాధాన్యం



చవితి ఉత్సవాలలో గణపతికి 21 రకాల పత్రి సమర్పించడం సంప్రదాయం. ప్రతి ఆకు ఒక ప్రత్యేకమైన ఔషధ గుణం కలిగి ఉంటుంది. పత్రి సమర్పణ వలన శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నమ్మకం. పత్రి వినియోగం పర్యావరణానికి అనుకూలమైన ఆచారం. పూజలో ఆకులు వాడటం వలన గాలి శుద్ధి, వాతావరణ శాంతి కలుగుతాయి. కాబట్టి వినాయక చవితి పత్రి పూజ ఆధ్యాత్మిక, వైద్య, పర్యావరణ పరమైన గొప్పతనాన్ని కలిగిస్తుంది.

– సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయిని, కాకినాడ

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయడం మంచి సంప్రదాయం. ప్రతి ఒక్కరిలో ఈ మేరకు అవగాహన రావాలి. గత ఐదేళ్లుగా తాను మట్టి గణపతి విగ్రహానికే పూజలు చేస్తున్నాను.

– కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్, సామర్లకోట

మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసరావు



మట్టి గణపతినే పూజిద్దాం



కాపవరంలో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

సామర్లకోట: చవితి ఉత్సవాల సందర్భంగా మట్టి గణపతి విగ్రహాన్నే పూజిద్దామని కాపవరంలో మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహిచారు. ఈ మేరకు ఓ విద్యార్థి గణపయ్య వేషధారణలో ప్రజలకు ప్లకార్డులు పంచి చైతన్యపరిచాడు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే పంచారామ క్షేత్రంలో బుధవారం గణపతి ఆలయం వద్ద చవితి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజలు జరుగుతాయన్నారు. పూజలు అనంతరం వెండి ఆభరణాల అలంకరణ ఉంటుందన్నారు.

శ్రీపాద శ్రీవల్లభునికి సహస్ర గులాబీలతో అర్చన





ప్రత్యేక అలంకరణలో వినాయకుడు, శ్రీపాద శ్రీవల్లభ స్వామి

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీ వల్లభ మహా సంవస్థానంలోని శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారి సప్తాహ మహోత్సవాలు ఆరు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామి వారికి సహస్ర గులాబీలతో అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తులుకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ దీపాలతో అలంకరణలు



కొత్తపల్లిలో గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అలంకరణలు

కొత్తపల్లి: మండలంలో సుమారు 500 వరకూ విగ్రహాలను ఏర్పాట్లు చేసేందుకు ఉత్సవ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. మండపాలను వివిధ రకాల ఆకృతులతో ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ స్థాయిలో విగ్రహాలతో పాటు, సెట్టింగులు వేస్తున్నారు.

ఎంపీడీఓకు రెడ్‌క్రాస్ పురస్కారం

సామర్లకోట: స్థానిక మండల ప్రజాపరిషత్ అధికారి కె.హిమమహేశ్వరి రెడ్‌క్రాస్ అవార్డును అందుకున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన రెడ్‌క్రాస్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రెడ్‌క్రాస్ ద్వారా నిర్వహించిన కార్యక్రమాలకు ఉత్తమ సేవలు అందించడంతో ఆమెకు సిల్వర్ మెడల్ దక్కింది. కలెక్టరు షన్మోహన్ ఆమెకు పతకాన్ని బహూకరించి అభినందించారు. ఈ మేరకు ఆమెను ఈఓపీఆర్డీ భైరవమూర్తి, ఏఓ బి.సతీష్ ఇతర సిబ్బంది అభినందించారు.



ఎంపీడీఓకు పురస్కారాన్ని అందజేసి అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

తీరంలో అలజడి

- ఎగసి పడుతున్న అలలు
- భారీగా కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం సముద్ర తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. సముద్ర అలలు ఎగసి పడడంతో తీరప్రాంతం కోతకు గురవుతోంది. బీచ్‌రోడ్డుకు రక్షణగా వేసిన రాళ్లగోడను సైతం దాటుకుని అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో బీచ్‌రోడ్డులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే మత్స్యకారుల గృహాలు కోతకు గురి కావడంతో వారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



ఉప్పాడ తీరప్రాంతంలో ఎగసి పడుతున్న అలలు

భారీ వర్షం

మండలంలో కురుస్తున్న భారీ వర్షానికి జన జీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది.



ప్రమాదకరంగా మారిన ఉప్పాడ బీచ్ రోడ్డు



ఉప్పాడలో కోతకు గురైన మత్స్యకార గృహాలు

పారిశ్రామిక, విద్యారంగ మార్పులను గమనించాలి

- అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్ చీఫ్ డాక్టర్ జహురుల్లా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అధ్యాపకులు, విద్యార్థులు నిరంతరం పరిశ్రమ, విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనించాలని ఆటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్‌వీహబ్ చీఫ్ డాక్టర్ జహురుల్లా ఎస్ఎండీ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఆటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్‌వీహబ్, నీతి ఆయోగ్, మైటీ స్టార్టప్ హబ్ సహకారంతో ఇండస్ట్రీ 4.0, 5.0 సాంకేతిక పరిజ్ఞానం, యాక్సలరేషన్ సహాయం అనే అంశంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జహురుల్లా ఎస్ఎండీ తన 17 ఏళ్ల అనుభవాన్ని పంచుకుంటూ పరిశ్రమలు, పరిశోధన విద్యారంగంలో వచ్చిన మార్పులను యువతకు వివరించారు. ఇండస్ట్రీ 4.0 ప్రాముఖ్యత, స్టార్టప్‌లకు అందే సహకారం, నైపుణ్యాభివృద్ధి అంశాలపై వివరించారు. జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో కేవలం బోధన, పరిశోధన పరిమితులే కాకుండా ఆవిష్కరణ, వినూత్న ఆలోచనల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ప్రామాణికతతో కూడిన పరిశోధనకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. అనంతరం జహరుల్లా ఎస్ఎండీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, రామలింగరాజు పాల్గొన్నారు.



జహురుల్లా ఎస్ఎండీని సత్కరిస్తున్న వీసీ ప్రసాద్, డైరెక్టర్ గోపాలకృష్ణ

విద్యార్థులకు యూనిఫాం వితరణ



విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 39 ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు పూర్వ విద్యార్థి డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్ యూనిఫాం పంపిణీ చేశారు. మంగళవారం ఆయన తన తండ్రి అప్పలస్వామి, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి రూ.70 వేల విలువైన దుస్తులను అందజేశారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ కీలకమైందని, సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ ఎస్.రాజరాజేశ్వరి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు పేపకాయల మాచరావు (డిప్యూటీ తహసీల్దార్), నక్కా శ్రీనుబాబు, నక్కా భీమశంకర్, పేకేటి దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ దుర్గారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

కాకినాడ రూరల్: మండలంలోని నేమాంలో సారా పూర్తిగా అరికట్టి సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామ సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు కోరారు. ఎక్సైజ్ శాఖ నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహన్‌రావు ఆదేశాలలో ఎస్సై వరహాలు, సిబ్బంది మంగళవారం నవోదయం 2.0 పథకం కింద గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను ఎస్సై వరహాలు వివరించారు. సర్పంచ్ సూర్య ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సారాతో పాటు బెల్ట్ షాపులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

- గణేష్ ఉత్సవ కమిటీలకు అధికారుల పిలుపు



ఉప్పలంక వద్ద నిమజ్జనం చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కరప: ప్రజలకు ఇబ్బంది లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, కరప ఎస్ఐ టి.సునీత ఉత్సవ కమిటీలను కోరారు. మండల పరిధిలోని గ్రామాలను మంగళవారం వారు పర్యటించి గణేష్ మండపాలను, నిమజ్జనం చేసే అరట్లకట్ట, పెనుగుదురు, ఉప్పలంక, గొర్రిపూడి, వేములవాడ, వేళంగి గ్రామాల్లోని పంట, మురుగు కాలువల్లోని రేవులను పరిశీలించారు. గణేష్ విగ్రహాలను నెలకొల్పేందుకు ఎటువంటి చలానాలు చెల్లించనవసరంలేదని, ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. నాలుగు అడుగులు దాటిన విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాలు రహదారులకు ఆటంకంలేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రి సమయంలో ముగ్గురు వలంటీర్లు కాపలాగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూదాలు, అశ్లీల నృత్యాల వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య లౌడ్‌స్పీకర్లు నిషిద్ధమన్నారు. నిమజ్జనంలో నీటి ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు దగ్గరుండి నిర్దేశించిన మార్గంలో ఊరేగింపులు జరిపి, నిమజ్జనం చేయాలని గ్రామాల్లోని ఉత్సవ కమిటీలను కోరారు. మండలంలోని 23 గ్రామాల నుంచి గణేష్ ఉత్సవాల నిర్వహణకు 139 దరఖాస్తులు వచ్చాయని ఎస్ఐ సునీత తెలిపారు. ఆర్ఐ పవన్ ఆయా గ్రామాల వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

కాకినాడ రూరల్: వచ్చేనెల ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు ఒడిశాలో జరగనున్న ఎంఈఎస్‌యూ–2025లో పాల్గొనేందుకు ఎన్‌సీసీ క్యాడెట్లు 20 మంది బోట్‌క్లబ్ ఉద్యానవన చెరువులో శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 18 నుంచి శిక్షణ ప్రారంభించామని నెలాఖరు వరకు ఉంటుందని కాకినాడ యూనిట్ 6 ఆంధ్ర నావల్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ అజయ్ యాదవ్ పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా చెరువులో పడవ లాగడం, తెర చాపను బిగించి ఏర్పాటు చేయడం (పడవ రిగ్గింగ్), తాళ్లతో పడవను లాగేందుకు ముడులు వేయడం, భౌతిక సామర్థ్యం, నాయకత్వ లక్షణం పెంపొందించడం తదితర అంశాలపై తర్ఫీదు ఇస్తున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం ఒడిశాలో జరిగే కార్యక్రమంలో పోటీ పాల్గొంటారన్నారు.



బోట్‌క్లబ్ ఉద్యానవనంలో తెర చాపను బిగించి, పడవను సిద్ధం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

శ్రామిక పక్షపాతి రాజగోపాల్

బోట్‌క్లబ్: శ్రామిక వర్గ పక్షపాతిగా జీవితకాలం వారికోసం తపించిన ధన్యజీవి ఎం.రాజగోపాల్ అని వక్తలు కొనియాడారు. సీపీఎం నాయకులు ఎం.రాజగోపాల్ ఐదో వర్ధంతి సభ స్థానిక సుందరయ్య భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సభలో వక్తలు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఆ సంఘం నాయకుడిగా కృషి చేసి ఉద్యోగ విరమణ అనంతరం సకల శ్రామిక వర్గం ప్రయోజనాల కోసం పనిచేసిన ధన్యజీవని కొనియాడారు. వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం, కోవిడ్ సమయంలో పార్టీ శ్రేణులను ఆదుకోవడం, యువ కార్యకర్తలను ఉద్యమాల వైపు ప్రోత్సహించడం తదితర కార్యక్రమాలలో ముందుండేవారని గుర్తు చేస్తున్నారు. రాజగోపాల్ అనుసరించిన మార్గాన్ని దీక్షతో కొనసాగిస్తూ సమ సమాజ స్థాపనకు పని చేయడమే రాజగోపాల్‌కు నిజమైన నివాళి అన్నారు. ముందుగా రాజగోపాల్ చిత్రపటానికి పార్టీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, కె.ఎస్. శ్రీనివాస్, పార్టీ కాకినాడ రూరల్ కమిటీ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.